

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి

రి.నెం. 119/2015

ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా

ఉచిత కళ్యాణ మండపం | స్వయం ఉపాధి శిక్షణ

ఉచిత రక్తదానము | ఉచిత న్యాయ సలహాలు

ఉచిత కంప్యూటర్ శిక్షణ

సంప్రదించవలసిన చిరునామా

ఆవుల విజయభాస్కర రెడ్డి B.A.,L.L.B

ఆళ్లగడ్డ


9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | శుక్రవారం | 04-09-2026 | సంపుటి : 08 | సంచిక 77 | పేజీలు : 8 | వెల : రూ 3-00


# సోషల్ మీడియాలో జెన్ జీ క్రియాశీలకం..

## అందుకు తగ్గట్టుగా సిద్ధమవ్వాలి: సీఎం చంద్రబాబు



అమరావతి, సెప్టెంబర్ 3: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కేబినెట్ సమావేశం ముగిసింది. ప్రధానంగా ఎల్‌నినోపైనే కేబినెట్‌లో సుదీర్ఘ చర్చ జరిగింది. మైనస్ 52 శాతంలో వర్షాలు నమోదయ్యాయని.. తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలని, సీడ్ బాల్స్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను కేబినెట్ ఆదేశించింది. పశుగ్రాసంపై దృష్టి పెట్టాలని కోరింది. కరవు పరిస్థితుల నేపథ్యంలో కేంద్రం నుంచి ఏ విధంగా నిధులు రాబట్టాలనే అంశంపైనా మంత్రివర్గంలో చర్చించినట్లు తెలుస్తోంది.వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు నీరు ఇవ్వడంపై ఆనందంగా ఉందని ఈ సందర్భంగా సీఎం అన్నారు. సీఎం కేబినెట్‌లోకి రాగానే అందరూ లేచి నిలబడి చప్పట్లతో అభినందనలు తెలియజేశారు. మంత్రి నిమ్మల రామానాయుడు, ఇంజినీరింగ్ అధికారులను ముఖ్యమంత్రి అభినందించారు. మంత్రులందరూ ప్రజలలోకి వెళ్లాలని చెప్పారు. 'మనం ఇన్ని పనులు చేస్తున్నాం.. వీటన్నింటినీ ప్రజలకు చెప్పుకోవాలి. కొత్త జనరేషన్ జెన్ జీ అన్ని విషయాలపై అవగాహనతో ఉంది. వాళ్లు సోషల్ మీడియాలో క్రియాశీలకంగా ఉన్నారు. మనం కూడా అందుకు తగినట్టుగా సిద్ధమవ్వాలి. మనం చేస్తున్న మంచిని జెన్ జీ వద్దకు తీసుకువెళ్లాలి' అని సూచించారు.వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని మంత్రులతో చంద్రబాబు అన్నారు. తప్పుడు, ఫేక్ ప్రచారాలు చేయడంలో వైసీపీ ముందు ఉంటుందని విమర్శించారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు నీటి విడుదలపై కూడా వైసీపీ సిగ్గు లేకుండా దుష్ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. ఈ ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్ట్ పూర్తైనా అది కూటమి ప్రభుత్వం చేసిందే అని.. ఈ విషయం ప్రజలు కూడా గమనిస్తున్నారని తెలిపారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను కూడా అదుపు చేయాలన్నారు. దీనిపై ఉన్న కేబినెట్ సబ్ కమిటీ ధరలపై జాగ్రత్తగా ఎప్పటికప్పుడు గమనించాలని అన్నారు. మంత్రులు పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, అచ్చెన్నాయుడు ధరల పెరుగుదలపై దృష్టి సారించాలని సీఎం చంద్రబాబు కోరారు.

# కాకినాడ సుడి తిరిగింది.. ప్రధాని మోదీ బిగ్ అనౌన్స్‌మెంట్



ప్రపంచంలోనే రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలైన భారత్, బెల్జియం మధ్య దౌత్య బంధం మరింత పటిష్టమైంది. సాంప్రదాయ వాణిజ్య సంబంధాలను దాటుకుని రక్షణ, హరిత ఇంధనం వంటి వ్యూహాత్మక రంగాలకు ఇరుదేశాల సహకారం వేగంగా విస్తరిస్తోంది. భారత్‌లో మూడు రోజుల పర్యటనకు విచ్చేసిన బెల్జియం ప్రధాని బాట్ డి వెవర్ తో ఢిల్లీలోని జాతీయ రాజధాని వేదికగా భారత ప్రధాని నరేంద్ర మోదీ గురువారం కీలక ప్రతినిధుల స్థాయి చర్చలు జరిపారు. దాదాపు రెండు దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత బెల్జియం ప్రధాని భారత్‌లో పర్యటించడం, అందులోనూ బాట్ డి వెవర్ పదవిలోకి వచ్చాక మన దేశానికి రావడం ఇదే తొలిసారి కావడం ఈ పర్యటన ప్రాధాన్యతను పెంచింది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. బెల్జియం భారత్‌కు సహజ రక్షణ, వాణిజ్య భాగస్వామి అని ఉద్ఘాటించారు. "గతంలో కేవలం వజ్రాల వ్యాపారానికే పరిమితమైన మన సంబంధాలు, ఇప్పుడు అత్యాధునిక రక్షణ రంగానికి, క్లీన్ ఎనర్జీకి చేరుకున్నాయి. భారత్ స్వదేశీ సాంకేతికతతో తయారు చేస్తున్న 'జోరావర్' రక్షణ ట్యాంకుల తయారీలో బెల్జియం భాగస్వామ్యం వహిస్తోంది. అంతేకాకుండా, ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ కేంద్రంగా ప్రపంచంలోనే అత్యంత భారీ గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టును సంయుక్తంగా నిర్మిస్తున్నాం" అని ప్రధాని సగర్వంగా ప్రకటించారు.ప్రధాని మోదీ ఇన్ డైరెక్ట్ వార్నింగ్- పాకిస్తాన్ పీఎం ఎదురుగానే వ్యాపారులకు బిగ్ ఆఫర్.. ఐదేళ్లలో రెట్టింపు వాణిజ్య లక్ష్యం! భారత్-యూరోపియన్ యూనియన్ మధ్య చారిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరిన నేపథ్యంలో ఇరుదేశాల మధ్య ఆర్థిక అవకాశాలు పుష్కలంగా పెరిగాయని ప్రధాని తెలిపారు. బెల్జియం కంపెనీలు భారత్‌లో సులభంగా పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా 'ఇన్వెస్ట్‌మెంట్ ఫాస్ట్ ట్రాక్ మెకానిజం'ను ఏర్పాటు చేశామన్నారు

# కొత్త పింఛన్లు, స్థానిక ఎన్నికలు.. మంత్రులతో లోకేశ్ కీలక చర్చ



అమరావతి, సెప్టెంబర్ 3: తెలుగుదేశం మంత్రులతో మంత్రి నారా లోకేశ్ బ్రేక్‌ఫాస్ట్ సమావేశం నిర్వహించారు. కొత్త పింఛన్లు, స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రధానంగా చర్చించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్టోబర్ నెల నుంచి దశల వారీగా కొత్త ఫించన్లు ఇవ్వాలని మంత్రి లోకేశ్ అన్నారు. వచ్చిన దరఖాస్తులన్నింటినీ ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ కొత్త ఫించన్లు ఇవ్వాలని మంత్రులకు తెలిపారు. అలాగే, స్థానిక ఎన్నికలకు అంతా సిద్ధమవ్వాలని.. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల్ని గెలిపించాలన్నారు. అక్టోబర్‌లోగా ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని..ఎన్నికలు వాయిదా పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.కోర్టు పెండింగ్‌లో ఉన్నవి కూడా త్వరితగతిన పరిష్కరించుకుని అన్నింటిలో ఎన్నికలు జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి అన్నారు. తొలుత పురపాలికలు, తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీలు, ఆ తర్వాత పంచాయతీ ఎన్నికలు జరుగుతాయన్నారు. ఎన్నికలు వాయిదా పడాలన్న గొడ్డలి పార్టీ కుయుక్తులు పని చేయవని చెప్పుకొచ్చారు. స్థానిక ఎన్నికలు వాయిదా పడితే ఫైనాన్స్ కమిషన్ నిధులు ఆగి రాష్ట్రానికి నష్టం జరగాలనే కుట్రతో గొడ్డలి పార్టీ ఉందని మండిపడ్డారు. అన్ని కోర్టు కేసులను త్వరితగతిన పరిష్కరించుకుని అనుకున్న సమయానికి ఎన్నికలు నిర్వహించి తీరుతామని తేల్చిచెప్పారు. విద్యా శాఖను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు పన్నుతున్న కుట్రల పట్ల తనతో పాటు సంబంధిత మంత్రులూ అప్రమత్తంగా ఉండాలని మంత్రి లోకేశ్ సూచించారు.విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సంక్షేమ శాఖలు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ కుట్రల్ని ధీటుగా తిప్పికొట్టాలని మంత్రి అన్నారు. మాట వినని అధికారుల్ని ఉపేక్షించేది లేదన్నారు. కొందరు అధికారుల పనితీరు శాఖకు, మంత్రికి చెడ్డపేరు తెచ్చేలా ఉంటే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నారు. ఒకరిద్దరు అధికారుల తీరు వల్లే ఇటీవల కొన్ని సమస్యలు ఉత్పన్నమయ్యాయని చెప్పుకొచ్చారు. వైద్య రంగానికి సంబంధించి ఎక్కడ ఏ చిన్న పొరపాటు జరిగినా సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని తప్పు పడుతూ కొందరు ట్రోల్ చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి వాటిపైనా మంత్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెప్టెంబర్ 9న అధినేత చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి అన్యాయంగా నిర్బంధించి 3ఏళ్లు అవుతుందని, నాటి దుశ్చర్య నుంచి ఎన్నో సవాళ్లు ఎదుర్కొని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న తీరు అందరికీ గుర్తు చేసేలా సెప్టెంబర్ 9న ఓ కార్యక్రమానికి రూపకల్పన చేద్దామన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికలు, పొదుపు చర్యలతో సమస్యను అధిగమిద్దామని మంత్రులతో లోకేశ్ పేర్కొన్నారు.

# విజయవాడ డెంటల్ కాలేజీలో రూ.60లక్షలతో అభివృద్ధి పనులు.. ప్రారంభించిన ఎంపీ చిన్ని

విజయవాడ, సెప్టెంబర్ 3: నగరంలోని ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో రూ.60 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన డెంటల్ చైర్స్, సీసీ రోడ్, పార్కింగ్ షెడ్, కాంపౌండ్ వాల్‌ను ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఈరోజు(గురువారం) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. డెంటల్ కళాశాల ఆవరణలో పలు అభివృద్ధి పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. 24 బెడ్‌లు, సీసీ రోడ్‌లను ప్రారంభించామని.. 500 మందికి ప్రతిరోజూ ఓపీ ఉంటుందని చెప్పారు. మెడికల్ యూనివర్శిటీలో కూడా అనేక కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఆర్‌ఓ ప్లాంట్, పేషెంట్‌ల కొరకు షెడ్‌లు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థుల కోసం హాస్టల్ సౌకర్యాన్ని కూడా తీసుకొస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ వెల్లడించారు.ఇక్కడ డెంటల్ కళాశాలకు ఎంతో గొప్ప చరిత్ర ఉందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 2014కు ముందు మోకాళ్ల లోతు నీరు ఉండేదని.. ఆ తరువాత సీసీ రోడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించామని తెలిపారు. ఇప్పుడు అరవై లక్షలతో మరిన్ని సేవలు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులు, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు పెంచుతామన్నారు. భవిష్యత్తులో ఐదు వేల మంది ఓపీకి రావాలని భావిస్తున్నామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పేర్కొన్నారు.

# కొండూరు కిడ్నీ బాధితుల జీవితాల్లో కొత్త ఆశలు నింపిన పవన్ కళ్యాణ్

ఎ.కొండూరుకు జేజేఎం?అమరజీవి జలధారలు

ఉద్దానం తరహా సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పవన్ కళ్యాణ్

26 నెలల కాలంలో రూ. 49.94 కోట్ల పనులు పూర్తి

38 ఆవాసాల పరిధిలో 130 కిలోమీటర్ల పైప్‌లైన్

ఇంటింటికీ కుళాయిలతో దాదాపు 75,000 మందికి స్వచ్ఛమైన తాగునీరు

మూత్రపిండాల వ్యాధి (క్రానిక్ కిడ్నీ డిసీజ్) బారినపడిన ప్రజలతో మరో ఉద్దానాన్ని తలపించే ప్రాంతం ఎన్టీఆర్ జిల్లా, ఎ.కొండూరు మండలం. ఈ మండల పరిధిలో మొత్తం 21 గ్రామ పంచాయతీలు, 38 ఆవాసాలు ఉండగా, దాదాపు అన్ని గ్రామాలు దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి ప్రభావిత ప్రాంతాలుగా ఉన్నాయి. అందులో గిరిజనులు మాత్రమే నివసించే 15 తండాలున్నాయి. తాగేందుకు గుక్కెడు నీరు దొరక్క, ప్రమాదమని తెలిసినా కలుషిత జలాలతో గొంతు తడుపుకునే పరిస్థితి నెలకొంది. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఈ సమస్య పవన్ కళ్యాణ్ దృష్టికి వచ్చింది. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎ.కొండూరుకు రక్షిత తాగునీటి సౌకర్యం కల్పించడం ద్వారా ఆ ప్రాంత ప్రజలను కిడ్నీ వ్యాధి బారి నుంచి కాపాడాలని సంకల్పించారు. అధికారం చేపట్టిన 26 నెలల్లోనే తన పరిధిలోని గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ ద్వారా జల్ జీవన్ మిషన్?అమరజీవి జలధారల నిధులతో ఎ.కొండూరు తాగునీటి ప్రాజెక్టును పూర్తి చేశారు. రూ. 49.94 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు 100 శాతం పనులు పూర్తి చేసుకుని ఆ ప్రాంత ప్రజల నీటి కష్టాలను తీర్చింది.- గత ప్రభుత్వం టెండర్ల ప్రక్రియ కూడా మొదలుపెట్టలేదు.ఎ.కొండూరు తాగునీటి ప్రాజెక్టును కూడా గత ప్రభుత్వం ఆర్భాటం చేసి, కనీసం టెండర్ ప్రక్రియను కూడా మొదలుపెట్టలేదు. ఒక్క పనీ ప్రారంభించలేదు. జల్ జీవన్ మిషన్ కింద చేపట్టిన ప్రాజెక్టు కావడం, గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో 2024 మార్చి నాటికి గడువు కూడా ముగియడంతో ఈ ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ పనులను ముందుకు తీసుకెళ్లారు.







# సంపాదకీయం

శుక్రవారం 04-09-2026

## జెన్ జీ నిజంగా అన్ ఫిట్టా....

సమాజంలో ఉద్యోగం, వ్యాపారం చేయడం ఎంత ముఖ్యమో.. మనుషులతో సంబంధాలు నెలకొల్పడం అంతే ముఖ్యం. మనుషుల మధ్య కమ్యూనికేషన్ ఉంటేనే కెరీర్లో ఎదగడం లేదా వ్యాపారంలో రాణించడం జరుగుతుంది. అయితే కొన్ని నివేదికల ప్రకారం ప్రస్తుతం ఉన్న జెన్ జీ గా పిలిచే యువతలో కమ్యూనికేషన్స్ స్కిల్స్ చాలా తక్కువగా ఉన్నాయని.. దీంతో ఇది వీరికి అడ్డంకిగా మారుతుందని ప్రముఖ సంస్థ లింక్డ్ ఇన్ తెలిపింది. దీంతో యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొంది. ఈ నివేదిక గురించి పూర్తి వివరాల్లోకి వెళ్తే..ప్రముఖ కమ్యూనికేషన్స్ సంస్థ లింక్డ్ ఇన్ తెలిపిన వివరాల ప్రకారం భారతదేశంలో సుమారు 83 శాతం మంది జెన్ జడ్ యువత నెట్వర్కింగ్ చేయడంలో వెనుకబడి ఉన్నట్లు తెలిపింది. నెట్వర్కింగ్ అంటే చాలామంది కేవలం ఉద్యోగం కోసం ఇతరులను పరిచయం చేసుకోవడమే అని అనుకుంటున్నారు. కానీ వారి జీవిత విశేషాలను ఇతరులతో పంచుకోవడం.. కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడం .. కెరీర్ కు సంబంధించిన విషయాలను అడగడం.. ఇతరులకు చెప్పడం వంటివి ఉంటాయి.అయితే ఈ విషయాలను ఇతరులతో పంచుకోవడంలో ఇప్పుడున్న యువతలో మొహమాటం ఎక్కువగా ఉన్నట్లు లింక్డ్ ఇన్ సంస్థ తెలిపింది. దీంతో యువత ఇతరులు ఏమనుకుంటారో నన్న భయం ఎక్కువగా కలిగి ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కెరీర్ ప్రారంభ విషయంలో యువత సీనియర్లను ఏదైనా విషయాలను అడగాలంటే చాలా భయపడిపోతున్నారు. అంతేకాకుండా తాము ఏదైనా మాట్లాడితే తిరస్కరిస్తారేమోనని.. తమ ఆలోచన ఇతరికి నచ్చదేమోనన్న మొహమాటంతో ఉన్నట్లు తెలుపుతున్నారు.లింక్డ్ ఇన్ తెలిపిన మరో విషయం ఏమిటంటే.. యువతలో 79 శాతం తమ కెరీర్ నెట్వర్క్ ప్రాముఖ్యత గుర్తిస్తున్నప్పటికీ.. 52 శాతం మందికి అసలు నెట్వర్కింగ్ ను ఎలా ప్రారంభించాలో తెలియడం లేదని తెలిపింది. ఇందులో భాగంగా ఇతరులతో ఎలా మాట్లాడాలి? మొదటి మెసేజ్ ఎలా పంపాలి? తమ గురించి ఎలా పరిచయం చేసుకోవాలి? అనే విషయాలను ఇతరులతో పంచుకోవడం లేదు.అయితే కొందరు నిపుణులు తెలుపుతున్న ప్రకారం నెట్వర్కింగ్ అంటే ఒకేరోజు వందల మందిని పరిచయం చేసుకోవడం కాదు.. ముందుగా తమ రంగానికి సంబంధించి ఒకరితో పరిచయం ఏర్పడి ఆ తర్వాత నెట్వర్క్ పెంచుకొని అవసరం ఉంటుందని తెలుపుతున్నారు. తమ ప్రొఫెషనల్ స్పేస్ ఇతరులను ప్రశ్నలు అడగడం.. కొత్త పరిచయాలు చేసుకోవడం వల్ల సమాజంలో అవగాహన కలుగుతుందని అంటున్నారు. అయితే నేరుగా ఇతరులతో మాట్లాడే ఇష్టం లేకపోతే సోషల్ మీడియా ప్లాట్ఫారం ద్వారా కూడా పరిచయం చేసుకోవచ్చని తెలుపుతున్నారు.యువతలో నెట్వర్కింగ్ సమస్త ఉంటే భారీగా అవకాశాలు కోల్పోయే అవకాశం ఉందని లింకుడ్ ఇన్ సంస్థ తెలుపుతుంది. కొన్నిసార్లు కేవలం ఆన్లైన్ ద్వారా మాత్రమే కాకుండా మనకు తెలిసిన వ్యక్తుల ద్వారా కూడా అవకాశాలు పొందే అవకాశం ఉంటుందని.. ఈ నేపథ్యంలో పరిచయాలు ఎంతో ముఖ్యమని అంటున్నారు. అంతేకాకుండా తమకు ఉన్న నైపుణ్యాలను ఇతరులకు తెలపాలంటే నెట్వర్కింగ్ ఎంతో అవసరమని చెబుతున్నారు. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ కాలేజెస్ అండ్ ఎంప్లాయర్స్ ఇతర మానవ వనరుల సర్వేల్లోని తాజా గణాంకాలు కొత్త గ్రాడ్యుయేట్ల పనితీరుపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఔంఅఇ అంటే నేషనల్ అసోసియేషన్ ఆఫ్ కాలేజెస్ అండ్ ఎంప్లాయర్స్ అని చెప్పాలి. ఇది అమెరికాలోని ఒక ప్రముఖ ప్రొఫెషనల్ లాభాపేక్షలేని సంస్థ, ఇది ఉన్నత విద్య మరియు కార్పొరేట్ ప్రపంచం మధ్య ఒక వంతెనలా పనిచేస్తుంది. 71.2 శాతం కంపెనీలు కొత్త గ్రాడ్యుయేట్లు ఉద్యోగానికి కేవలం కొంతమేరకు సిద్ధంగా ఉన్నారని గుర్తించాయి. కేవలం 21.6% కంపెనీలు జెన్ జీలను జాబ్ చేయడానికి సిద్ధంగా ఉన్నారని భావించాయి. 7.2% ఎంప్లాయర్లు వారు అసలు సిద్ధంగానే లేరని అభిప్రాయపడ్డారు.: ఇటీవల నియమితులైన కొత్త గ్రాడ్యుయేట్ల ఆన్-జాబ్ పనితీరు అత్యంత సంతృప్తికరంగా లేదు అని 75 శాతం కంపెనీలు అంగీకరించాయి. 800 మందికి పైగా ఊఖీ అధికారులపై జరిగిన మరో సర్వేలో 37 శాతం అధికారులు, కొత్త గ్రాడ్యుయేట్కు ఉద్యోగం ఇవ్వడం కంటే రోబోట్ లేదా ంఎ టెక్నాలజీతో పని చేసుకోవడం మంచిదని చెప్పారు.కరోనా వ్యాప్తి సమయంలో సంవత్సరాల పాటు స్కూల్స్, కాలేజీలు మూసేశారు. ఈ సమయంలో అధిక స్క్రీన్ టైమ్, మనుషుల నుంచి దూరం పాటించడం, వర్క్ ఫ్రం హోమ్ లేదా ఆన్లైన్ క్లాసుల వాతావరణం కొనసాగింది. లేకపోవడంతో, వీరిలో ఆఫీస్ నార్మ్స్ లో భారీ లోపం కనిపిస్తోంది.కొత్త విద్యార్థులు కమ్యూనికేట్ చేయడంలో, నిజ జీవిత సమస్యలను ఎదుర్కొనడంలో వెనుకబడుతున్నారని న్యూయార్క్ యూనివర్సిటీకి చెందిన సైకాలజీ ప్రొఫెసర్ టెస్సా వెస్ట్ అన్నారు. ఇప్పుడు ఈ లోపాలను సరిచేసి, వారిని ప్రవర్తనా నైపుణ్యాలు మెరుగుపరిచే బాధ్యత విద్యాసంస్థలపై పడింది.ఈ పెరుగుతున్న స్కిల్స్ గ్యాప్ను తగ్గించి, యువతను వర్క్ ప్లేస్కు అనుగుణంగా మార్చేందుకు నిపుణులు అనేక ముఖ్య సూచనలు చేశారు ప్రొఫెసర్ టెస్సా వెస్ట్ ప్రకారం, టెక్నికల్ స్కిల్స్ సులభంగా నేర్పించవచ్చు. కానీ మాట్లాడటం, చర్చించడం, అభిప్రాయ భేదాలను తెలపడం, టీమ్తో కలిసి పనిచేయడం నేర్చుకోవడానికి ఎక్కువ సమయం పడుతుంది. అందువల్ల విద్యాసంస్థలు సాఫ్ట్ స్కిల్స్పై ఫోకస్ చేయక తప్పదు. యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా ప్రొఫెసర్ పీటర్ కాపెల్లీ మాట్లాడుతూ.. ఈ సమస్యకు కేవలం కాలేజీలు, విద్యాసంస్థలనే బాధ్యులుగా చేయడం సరికాదు.

## అమెరికా, కెనడాల నుంచి లండన్కు 86 టన్నుల పసిడి.. తరలించిన నెదర్లాండ్స్ సర్కారు..!

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో నెదర్లాండ్స్ ప్రభుత్వం అత్యంత కీలక నిర్ణయాన్ని అమలు చేసింది. అమెరికా కెనడా దేశాల్లో నిల్వ ఉంచిన తమ 86 టన్నుల పసిడి నిల్వలను బ్రిటన్ రాజధాని లండన్ లోని 'బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ వాల్ట్కు విజయవంతంగా తరలించినట్లు డచ్ సెంట్రల్ బ్యాంక్ అధికారికంగా ధ్రువీకరించింది.సంక్షోభ సమయంలో ఈ పసిడిని అత్యంత వేగంగా ట్రేడింగ్ చేయడానికి, నగదు రూపంలోకి మార్చుకోవడానికి వీలుగానే ఈ క్లిష్టమైన ఆపరేషన్ను పూర్తి చేసినట్లు బ్యాంక్ గవర్నర్ ఒలాఫ్ స్లీపెన్ వెల్లడించారు. ఈ భారీ తరలింపు ప్రక్రియను ఈ ఏడాది మార్చి నుంచి ఆగస్టు మధ్య కాలంలో రెండు విభిన్న పద్ధతుల్లో అత్యంత జాగ్రత్తగా నిర్వహించారు. మొదటగా అమెరికా, కెనడాలలోని బ్యాంకుల నుంచి సుమారు 27 టన్నుల భౌతిక (ఫిజికల్) బంగారాన్ని నెదర్లాండ్స్లోని జైస్ట్ (జివతిబబి) ప్రాంతానికి తీసుకొచ్చి, అక్కడి నుంచి లండన్లోని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్కు భద్రంగా చేర్చారు.ఇక మిగిలిన పసిడికి సంబంధించి రవాణా ప్రమాదాలను తగ్గించేందుకు న్యూయార్క్లో ఉన్న గోల్డ్ బార్లను అక్కడే విక్రయించి, సమాన పరిమాణంలోని అంతర్జాతీయ ప్రామాణిక బంగారాన్ని తిరిగి లండన్ మార్కెట్లో కొనుగోలు చేశారు. ఈ విధానంవల్ల బంగారాన్ని కరిగించాల్సిన అవసరం లేకుండానే సమర్థవంతంగా లండన్కు తరలించడం సాధ్యమైంది. ప్రస్తుతం అమెరికా-కెనడా మధ్య నడుస్తున్న వాణిజ్య పోరు, పశ్చిమాసియాలో ఇరాన్ ఉద్రిక్తతలు, అగ్రరాజ్య ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న ఆందోళనల మధ్య డచ్ బ్యాంక్ ఈ చర్యకు పూనుకోవడం అంతర్జాతీయంగా తీవ్ర ప్రాధాన్యత సంతరించుకుంది.ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత లిక్విడిటీ ఉన్న గోల్డ్ మార్కెట్గా లండన్ గుర్తింపు పొందింది. లండన్లోని 'బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్' అధునాతన బాంబ్-ప్రూఫ్ వాల్ట్లలో ప్రపంచ పసిడి నిల్వల్లో దాదాపు ఐదో వంతు భద్రపరచబడి ఉంది. ఇక్కడ వివిధ దేశాల కేటాయింపులు పక్కపక్కనే ఉండటంతో అత్యవసర సమయాల్లో భౌతికంగా బంగారాన్ని రవాణా చేసే పనిలేకుండా, వాల్ట్లోని అరలు మార్చడం ద్వారానే వేల కోట్ల విలువైన అంతర్జాతీయ లావాదేవీలను క్షణాల్లో పూర్తి చేయడానికి వీలవుతుంది.



## రెస్టారెంట్లలో కుళ్లిన మాంసం.. స్వీట్లలో హోలీ రంగులు!



పశ్చిమ బెంగాల్లో ఆహార భద్రతపై అధికారులు చేపట్టిన తనిఖీల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. కోల్కతాలోని ప్రముఖ రెస్టారెంట్లు, ఫుడ్కోర్టులు, స్వీట్ షాపుల్లో తనిఖీలు నిర్వహించగా.. కిలోల కొద్దీ కుళ్లిపోయిన, బూజు పట్టిన మాంసంతో పాటు పాడైపోయిన రొయ్యలు, గడువు ముగిసిన ఆహార పదార్థాలు బయటపడ్డాయి. కొన్ని చోట్ల ఆహార పదార్థాల్లో, స్వీట్ షాపులు, బేకరీల్లోనూ మిఠాయిలకు హోలీ రంగును ఉపయోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.మహారాష్ట్రలో ఆహార భద్రతా నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్న ఐఏఎస్ అధికారి తుకారాం ముండే ప్రభావంతో దేశంలోని ఇతర రాష్ట్రాల్లోనూ ఆహార సంస్థలపై తనిఖీలు పెరిగినట్లు తెలుస్తోంది. తుకారాం ముండే.. రెండు నెలల క్రితం మహారాష్ట్ర ఎఫ్డీఏ కమిషనర్గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రెస్టారెంట్లు, హోటళ్లు, గిడ్డంగులపై వరుసగా దాడులు జరుగుతున్నాయి.ఇదే సమయంలో బెంగాల్లోనూ గత మూడు రోజులుగా భారీగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. దసరా పండుగకు మరో నెల రోజులు మాత్రమే ఉండటంతో ఈ తనిఖీలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పండుగ సమయంలో రెస్టారెంట్లు, హోటళ్లకు వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుంది.బెంగాల్లో సెప్టెంబరు 1 నుంచి 8 వరకు ఆహార నాణ్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని న్యూ మార్కెట్ ప్రాంతంలో ప్రారంభించిన ముఖ్యమంత్రి సువెందు అధికారి.. ఆహార కల్తీ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించని రెస్టారెంట్లు, హోటళ్ల లైసెన్సులు రద్దు చేస్తామని సీఎం హెచ్చరించారు.

## యాసిన్ మాలిక్ సంచలన నిర్ణయం..

### సరళా భట్ హత్య కేసులో కీలక ప్రకటన

తిహార్ జైలులో ఉన్న వేర్పాటువాద నాయకుడు.. నిషేధిత జమ్మూ కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ అధినేత యాసిన్ మాలిక్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. 1990లో కశ్మీరీ పండిట్ నర్సు సరళా భట్ హత్య కేసు విచారణను ఇకపై తాను వ్యతిరేకించబోనని శ్రీనగర్లోని అదనపు సెషన్స్ కోర్టుకు లిఖితపూర్వకంగా తెలిపారు. తనకు మరణశిక్ష విధించే అంశాన్ని కోర్టు పరిశీలించవచ్చని పేర్కొంటూ 25 పేజీల వాంగ్మూలాన్ని తన న్యాయవాది అబు ఆదిల్ పండిట్ ద్వారా దాఖలు చేశారు. అయితే.. ఈ నిర్ణయాన్ని నేరాన్ని అంగీకరించినట్లుగా భావించరాదని మాలిక్ స్పష్టం చేశారు. రాజకీయ పరిస్థితుల కారణంగా తనను ఈ కేసులో తప్పుగా ఇరికించారని పేర్కొన్న ఆయన.. చాలా ఆలోచించిన తర్వాత, 'ఇస్తిఖారా' ప్రార్థన చేసిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. కేసు తదుపరి విచారణను కోర్టు సెప్టెంబర్ 19కి వాయిదా వేసింది.ఇదే సమయంలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి కూడా మాలిక్ కీలక ప్రకటన చేశారు. పాకిస్తానీ కళాకారిణి ముషాల్ హుస్సేన్ ముల్లిక్తో తన 16 ఏళ్ల వివాహ బంధానికి ముగింపు పలకాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. 2009లో వీరిద్దరూ వివాహం చేసుకోగా.. వారికి రజియా సుల్తానా అనే 13 ఏళ్ల కుమార్తె ఉంది. తన కుమార్తె రజియా తన తల్లి, అమ్మమ్మను జాగ్రత్తగా చూసుకోవాలని, కష్టకాలంలో కుటుంబం తనకు అండగా ఉందనే భావన కలిగేలా ప్రతిరోజూ ఆమెతో కొంత సమయం మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు.సర్లా భట్ హత్య కేసు మూడు దశాబ్దాలకు పైగా నాటి కీలకమైన కేసుగా ఉంది. షేర్-ఎ-కాశ్మీర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ూఖఎటూ)లో స్టాఫ్ నర్సుగా పనిచేసిన కశ్మీరీ పండిట్ సర్లా భట్ 1990 ఏప్రిల్లో ఉగ్రవాదం తీవ్రంగా ఉన్న సమయంలో అపహరణకు గురయ్యారు. కొద్ది రోజుల తర్వాత ఆమె మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన కశ్మీరీ పండిట్ సమాజంలో తీవ్ర భయాందోళనలకు దారితీసింది. చాలా కాలం పాటు పరిష్కారం కాని ఈ కేసును 2025లో జమ్మూ కశ్మీర్ పోలీసుల స్టేట్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ూఎం) తిరిగి తెరిచిందిఈ క్రమంలో యాసిన్ మాలిక్తో పాటు కేసుతో సంబంధం ఉన్న పలువురి ప్రదేశాల్లో సోదాలు నిర్వహించి, చార్జిషీట్లో మాలిక్, ఖుర్షీద్ అహ్మద్ చల్కు, అబ్దుల్ హమీద్ షేక్, మహమ్మద్ యూసుఫ్ సోఫీ, గులాం మహమ్మద్ తప్లూ పేర్లను చేర్చింది. ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన ఖుర్షీద్ అహ్మద్ చల్కు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పేర్కొనగా, మహమ్మద్ యూసుఫ్ సోఫీ, అబ్దుల్ హమీద్ షేక్, గులాం మహమ్మద్ తప్లూ మరణించారు. దీంతో జీవించి ఉన్న ప్రధాన నిందితుడిగా యాసిన్ మాలిక్ మిగిలారు. ప్రస్తుతం తిహార్ జైలులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న మాలిక్.. జమ్మూలో వేరొక హత్య కేసులో కూడా విచారణను ఎదుర్కొంటున్నాడు.



## కాంగ్రెస్ పాలనలో వ్యవసాయం వదిలి ముంబాయికి వలసలు : మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



మహబూబ్ నగర్ : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినాక రైతులు వ్యవసాయం వదిలి ముంబాయికి వలసలు వెళ్లే పరిస్థితిని తీసుకొచ్చారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ (ఆరోపించారు. మహబూబ్ నగర్ మండల పరిధిలోని కోడూరు చౌరస్తాలో గురువారం నిర్వహించిన రైతు సదస్సు, ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారుబీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయం పండుగ లెక్కన సాగు చేశారు. కేసీఆర్ హయాంలో పంటల సాగు పెరిగింది. భూమి విలువ పెరిగింది. చెక్ డ్యాంలు కట్టారు. చెరువులు నింపారు. అప్పుడు యూరియాకు కొరత లేదు. కరెంటు సరిపడ ఇచ్చారు. ఇప్పుడు యూరియా కోసం రైతులు పంట పొలాలు వదిలి యూరియా కేంద్రాల వద్ద గంటల తరబడి నిలబడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.రేవంత్ ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి మాట తప్పిండ్రు. కౌలు రైతులకు, రైతు కూలీలకు డబ్బులు ఇస్తామని మోసం చేశారని ఆరోపించారు. రైతులకు రైతు బంధు లేదు.. రైతు బీమా ప్రీమియం కట్టలేదు. రైతు చనిపోతే డబ్బులు ఇచ్చే పరిస్థితి లేదని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ పాలన వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బతిందని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, మాజీ వైస్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, రైతు కమిటీ మాజీ చైర్మన్ మల్లు నర్సింహా రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మల్లు దేవేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ సుధా శ్రీ, పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు రవీందర్ రెడ్డి, రాజ గోపాల్, చెన్నయ్య యాదవ్, అల్లాఉద్దీన్, రాఘవేందర్ గౌడ్, శ్రీనివాసులు, నర్సింహులు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## తమిళనాడు మాజీ సీఎం స్టాలిన్కు మద్రాస్ హైకోర్టులో చుక్కెదురు



తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్కు కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఇటీవల ఎన్నికల్లో కొళత్తూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆయన ఓట్ల కౌంటింగ్పై పలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కోర్టును ఆశ్రయించారు. అయితే, ఆయన పిటిషన్ను మద్రాస్ హైకోర్టు కొట్టేసింది. పిటిషన్ విచారణకు అర్హమైనది కాదని చీఫ్ జస్టిస్ ఎస్ఏ ధర్మాధికారి, జస్టిస్ జీ అరుల్ మురుగన్లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది.ఎన్నికల్లో స్టాలిన్కు 74,202 ఓట్లు పోలయ్యాయి. ప్రత్యర్థి టీవీకే పార్టీకి చెందిన వీఎస్ బాబు 82,997 ఓట్లతో విజయం సాధించారు. ఫలితాలపై సందేహాలు వ్యక్తం చేసిన డీఎంకే అధినేత మే7 ఈవీఎంల బర్న్ మెమరీ, మైక్రోకంట్రోలర్ పరిశీలను దరఖాస్తు చేసుకున్నారు. జులై 29న జరిగిన పరిశీలన సందర్భంగా కొన్ని ఈవీఎంలు పనిచేయకపోవడాన్ని స్టాలిన్ గుర్తించారని ఆయన తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ పేర్కొన్నారు. నిజానిజాలు తెలుసుకునేందుకు నియోజకవర్గంలోని 100 శాతం వీవీప్యాట్లను మళ్లీ పరిశీలించాలని కోరారు.ఎలక్షన్ కమిషన్ తరఫున సీనియర్ అడ్వకేట్స్ న్యాయవాదులు జీ రాజగోపాల్, దామా శేషాద్రినాయుడు హాజరయ్యారు. వారు తమ వాదనలు వినిపిస్తూ ఎన్నికల కౌంటింగ్పై అభ్యంతరాలను ఈసీఐకి పిటిషన్ ద్వారానే పరిష్కరించాలని చెప్పారు. ప్రజాప్రతినిధుల చట్టం ప్రకారం ఈ పిటిషన్ను కొనసాగించే అవకాశం లేదని అన్నారు. ఈ కేసులో ఇటీవలే వాదనలు ముగిశాయి. తాజాగా మద్రాస్ హైకోర్టు మాజీ సీఎం స్టాలిన్ పిటిషన్ను కొట్టేసింది.

## కమర్షియల్ పైలట్గా అభినందన్ వర్ధమాన్..


న్యూఢిల్లీ, సెప్టెంబర్ 03: భారత వాయుసేనలో మాజీ గ్రూప్ కెప్టెన్, వీర చక్ర పురస్కార గ్రహీత అభినందన్ వర్ధమాన్ కొత్త కొలువును ఎంచుకున్నారు. గోవాకు చెందిన ప్రాంతీయ విమానయాన సంస్థ ఈఒజ91లో కమర్షియల్ పైలట్గా ఆయన చేరారు. ఆగస్టులోనే ఆయన ఈ ఉద్యోగంలో చేరినట్లు జాతీయ మీడియా వెల్లడించింది. ఈ నేపథ్యంలో 22 ఏళ్లుగా వాయుసేనలో వివిధ హోదాల్లో పని చేసిన అభినందన్ వర్ధమాన్.. ముందస్తుగానే ఉద్యోగానికి పదవి విరమణ చేశారు. అయితే కొత్త ఉద్యోగంలో చేరికపై ఇప్పటి వరకు ఆయన ఎలాంటి ప్రకటన చేయలేదు.2019లో ఫిబ్రవరిలో పుల్వామా వద్ద జరిగిన ఉగ్రదాడిలో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు మరణించారు. అందుకు ప్రతీకారంగా భారత్.. పాకిస్థాన్లోని బాలాకోట్లో జైషే మహమ్మద్ ఉగ్రవాద శిబిరాలపై మెరుపుదాడులు చేసింది. ఈ నేపథ్యంలో పాక్ వైమానిక దళానికి ఎఫ్-16 యుద్ధ విమానం భారత్లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించింది. దీనిని తన మిగ్ విమానంతో వింగ్ కమాండర్ అభినందన్ ఆకాశంలోనే ధ్వంసం చేశారు. అదే సమయంలో ఆయన ప్రయాణిస్తున్న ఆ విమానం దెబ్బతింది.ఈ నేపథ్యంలో పారాచూట్ సాయంతో కిందకి దూకారు. దాంతో ఆయన పాక్ ఆక్రమిత కశ్మీర్ భూభాగంలో దిగారు. దీంతో అభినందన్ను పాక్ సైన్యం చుట్టుముట్టింది. మూడు రోజుల పాటు ఆయనను పాక్ సైన్యం బందీగా ఉంచింది. అభినందన్ వర్ధమాన్ను వెంటనే తమకు అప్పగించాలంటూ పాక్పై భారత్ తీవ్ర ఒత్తిడి చేసింది. దీంతో ఆయనను భారత్కు పాక్ అప్పగించింది. ఈ నేపథ్యంలో అభినందన్ వర్ధమాన్ పేరు దేశవ్యాప్తంగా మారుమ్రోగింది. దేశంలో మూడో అత్యున్నత యుద్ధ పురస్కారం వీరచక్రతో ఆయనను భారత్ ప్రభుత్వం గౌరవించింది.

# బంధం... బలపడుతోంది....

విజయవాడ, సెప్టెంబర్ 3 ఏపీలో రాజకీయాలు విచిత్రంగా ఉంటాయి. మూడు పార్టీల కూటమి ఒక వైపు.. మరోవైపు విపక్ష వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉంది. ఆ మూడు పార్టీల మధ్య బంధం స్ట్రాంగ్ గా ఉంది. అలా ఉన్నంతవరకు ఆ కూటమిని వైసిపి ఏం చేయలేదు అనేది మెజారిటీ విశ్లేషకుల భావన. అయితే ఐక్యం అనేది ఆ మూడు పార్టీల ఇష్టం. వైసిపి గెలవాలి అనుకున్నవారు కూటమి విచ్చిన్నం కావాలని కోరుకుంటారు. మెజారిటీ వైసీపీ శ్రేణులు కోరుకునేది అదే. అందుకే ఆ మూడు పార్టీల మధ్య విఘాతానికి చేయని ప్రయత్నం అంటూ లేదు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్, లోకేష్ల మధ్య గట్టి తగాదా రావాలని బలంగా కోరుకుంటున్నారు. కానీ రోజు రోజుకి వారి మధ్య బంధం పెరుగుతూనే ఉంది కానీ.. తగ్గడం లేదు. పవన్ కళ్యాణ్ విషయంలో నారా లోకేష్ చేసిన ప్రకటన వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతోంది.ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు ఈరోజు. తెలుగు రాష్ట్రాల్లో వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. కూటమి పార్టీల శ్రేణులు పాల్గొంటున్నాయి. దేశవ్యాప్తంగా ప్రముఖులు పవన్ కళ్యాణ్ కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. అయితే అందరికంటే నారా లోకేష్ శుభాకాంక్షలు ప్రత్యేకంగా నిలిచాయి. సినీ అభిమానుల దృష్టిలో పవర్ స్టార్.. జనసైనికుల దృష్టిలో సేనాని.. నాకు మాత్రం దేవుడు ఇచ్చిన అన్న పవన్ అంటూ సంబోధించారు నారా లోకేష్. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మండిపడుతున్నాయి. ఆ పార్టీ మీడియాతో పాటు సోషల్ మీడియా ఏవేవో వ్యాఖ్యానాలు చేస్తున్నాయి.పవన్ కళ్యాణ్ విషయంలో లోకేష్ మాత్రం చాలా ప్రత్యేకంగా చూస్తుంటారు. పవన్ కళ్యాణ్ జనసేన అధినేత. లోకేష్ తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్. కానీ వారిద్దరి మధ్య బంధం బాగానే ఉంటుంది. అది ఎంత మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రుచించదు. అందుకే లోకేష్ పవన్ విషయంలో స్పందించిన ప్రతిసారి వైసీపీకి ఎక్కడలేని కోపం. వారు భాగస్వామ్య పార్టీల అధినేతలు. ఆ పైవారు పరస్పరం గౌరవించుకుంటున్నారు కానీ ఈ విషయంలో ఎందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అతిగా రియాక్ట్ అవుతుందో తెలియడం లేదు. ప్రస్తుతం వైసీపీ అనుకూల మీడియాతో పాటు సోషల్ మీడియాలో.. పవన్ కళ్యాణ్ ను ఆకాశానికి ఎత్తేస్తున్న లోకేష్ అంటూ శీర్షికలు పెట్టి కథనాలు రాస్తున్నారు. వాళ్లు స్నేహితులు. వారు చేసుకోకపోతే ఎవరు చేస్తారు? అసలు ఈ విషయంలో వైసీపీకి ఎందుకు అంత ఉత్సాహం? అంటే వారు కలిసి ఉంటే తనకు సుఖం ఉండదు. తనకు విజయం దక్కాలంటే వారు కలిసి ఉండకూడదు. కానీ వారి మధ్య బంధం రోజురోజుకు పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. ఏపీలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. పవన్ పుట్టినరోజు సందర్భంగా మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది జనసేన. పిఠాపురం నియోజకవర్గంలో పార్టీ యువజన విభాగం పేరును 'జై కొట్టు' గా నామకరణం చేసింది. జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ఈ నూతన విభాగం 'జై కొట్టు'ను ఆవిష్కరించారు. జై కొట్టు పేరుతో ప్రత్యేకంగా ఒక పాటను కూడా విడుదల చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియాను ఈ పాట షేక్ చేస్తోంది. పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు అంబరాన్ని తాకాయి.పవన్ కళ్యాణ్ గత కొద్దిరోజులుగా కేరళలో ఉంటున్న సంగతి తెలిసిందే. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన అక్కడ ప్రకృతి వైద్యశాలలో వైద్య సేవలు పొందుతున్నారు. అందుకే తన జన్మదిన వేడుకలకు హాజరు కాలేకపోయారు. కానీ రాష్ట్రవ్యాప్తంగా పవన్ జన్మదిన వేడుకలు అంబరాన్ని తాకుతున్నాయి. ఎక్కడికక్కడే బైక్ ర్యాలీలు చేపడుతున్నారు.. ఆలయాల్లో పూజలతో పాటు సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. జనసేనకు ముఖ్యంగా యువత బలం అధికం. అందుకే ఆ పార్టీ యువజన విభాగానికి ప్రత్యేక నామకరణం చేయాలని భావించారు. అందుకు పవన్ పుట్టినరోజు వేడుకలను వేదికగా చేసుకున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో పవన్ జన్మదిన వేడుకల్లో పార్టీ యువజన విభాగానికి జై కొట్టు అనే ప్రత్యేక పేరును పెట్టారు.మరోవైపు ఈ జై కొట్టు అనే నినాదానికి.. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ పాత తోడైంది.' జై కొట్టు' పేరుతో ప్రత్యేకంగా పాటను కూడా విడుదల చేశారు. ఈ పాటకు థమన్ మ్యూజిక్ అందించారు.. అయితే ఇంత పెద్ద కార్యక్రమానికి పవన్ కళ్యాణ్ హాజరు కాలేకపోయారు. అందుకే ఆయన ఆడియో మెసేజ్ పంపించారు. చెయ్యెత్తి జై కొట్టు నినాదం అందర్నీ ఆకట్టుకుంటుందని మనోహర్ అభిప్రాయపడ్డారు. ఆ స్ఫూర్తిని అందించాలనే జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఈ లోగోను తీసుకొచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. జై కొట్టు నినాదంతో యువత ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాజకీయాల్లో యువతకు ప్రత్యేక స్థానం కల్పించాలన్న ఉద్దేశంతోనే ఈ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# సజ్జల టార్గెట్ గా విజయసాయి పాలిటిక్స్

విజయవాడ, సెప్టెంబర్ 3,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, కొత్త రాజకీయ పార్టీ స్థాపించే దిశగా అడుగులు వేస్తున్న మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి విడుదల చేసిన రెండు పేజీల ఓపెన్ లెటర్ ఆ పార్టీలో పెద్ద తుఫానునే సృష్టించింది. కేవలం ఆత్మరక్షణ కోసం మాత్రమే కాకుండా, ఏకంగా వైఎస్సార్‌సీపీ మునిగిపోతున్న నౌకగా మారడానికి ప్రధాన కారకుడు సజ్జల రామకృష్ణారెడ్డి అనబడే ఓ శక్తివంతమైన కోటరీనేనని ఆయన నేరుగా నిందించడం సంచలనం రేపింది. కొత్త పార్టీ ఆవిర్భావానికి ముందే సాయిరెడ్డి విసిరిన ఈ సవాలు, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాజకీయ చదరంగంలో సజ్జల పాత్రపై ఉన్న ఆరోపణలను ఒక్కసారిగా క్యాడర్ ముందుకు తీసుకొచ్చింది.గడిచిన కొన్నేళ్ల పరిణామాలను పరిశీలిస్తే, వైఎస్సార్‌సీపీ సాధించిన 2019 ఘనవిజయం తర్వాతి కాలంలో పార్టీలో సజ్జల ప్రభావం అమాంతం పెరిగిపోయిందనేది రాజకీయ వర్గాల్లో బహిరంగ రహస్యమే. అయితే ఆశ్చర్యకరంగా సజ్జల చేతికి తాడేపల్లి పవర్ సెంటర్ వచ్చినప్పటి నుంచే జగన్‌కు వరుస ఎదురుదెబ్బలు తగలడం మొదలయ్యాయి. 2024 ఎన్నికల్లో కేవలం 11 సీట్లకు పరిమితమై ప్రతిపక్ష హోదాను కూడా కోల్పోవడం, ఢిల్లీ స్థాయిలో పార్టీకి సంబంధాలు తెగిపోవడం, కీలకమైన నంబర్-2 నాయకులంతా పక్కకు తప్పుకోవడం, చివరకు వైఎస్ కుటుంబంలోనే చీలిక వచ్చి షర్మిల, విజయమ్మలు దూరమవ్వడం వంటివన్నీ సజ్జల పర్యవేక్షణ కాలంలోనే జరిగాయి. సాయిరెడ్డి లేఖ సజ్జలపై విసిరిన విమర్శ మాత్రమే కాదు. అది జగన్ సొంతంగా నిర్ణయాలు తీసుకోలేరు, కోటరీ చేతిలో బందీ అయ్యారు అన్న సత్యాన్ని పార్టీ కేడర్‌కు నమ్మించేలా వేసిన పక్కా పొలిటికల్ స్కెచ్ 2024 దారుణ ఓటమి తర్వాత కూడా తాడేపల్లి




గడప దాటి అసలు నిజాలు జగన్‌కు చేరకపోవడానికి సజ్జల వ్యవహారశైలే కారణమని గ్రామ స్థాయి నాయకుల వరకు తీవ్ర ఆక్రోశంతో ఉన్నారు. సాయిరెడ్డి బహిరంగంగా లేఖ రాయడం ద్వారా, ఆ నిరాశలో ఉన్న కేడర్ మొత్తాన్ని తన వైపు తిప్పుకోవడానికి లేదా వారిలోని అసమ్మతిని బయటకు తేవడానికి బలమైన పునాది వేశారు.జగన్ నమ్మకస్థుడిగా 15 నెలలు జైలు జీవితం గడిపిన సాయిరెడ్డి వంటి నేతను సైతం అవమానించి పంపేశారని చూపించడం ద్వారా, పార్టీ కోసం కష్టపడిన వారిని కాపాడుకోలేక కోటరీని మోసే నాయకుడు " అనే ముద్ర జగన్‌పై పడేలా చేశారు. ఇది భవిష్యత్తులో మిగిలిన ద్వితీయ శ్రేణి నేతలు కూడా పార్టీ మారడానికి మానసిక ధైర్యాన్ని ఇస్తుంది. విజయసాయిరెడ్డి లేఖతో ఇప్పుడు వైఎస్సార్‌సీపీ తాడేపల్లి వర్గాలు రక్షణ ధోరణిలోకి వెళ్లక తప్పడం లేదు. సజ్జలను సమర్థించుకుంటే సొంత పార్టీ శ్రేణులే తిరగబడే పరిస్థితి, ఆయనను పక్కన పెడితే తప్పు ఒప్పుకున్నట్లు అయ్యే పరిస్థితి జగన్‌కు ఎదురైందివిజయసాయిరెడ్డి సృష్టించిన ఈ రాజకీయ అలజడి కేవలం సజ్జల వర్సెస్ సాయిరెడ్డి యుద్ధం మాత్రమే కాదు. వైఎస్సార్‌సీపీ ఎంత త్వరగా తన తప్పులను సరిదిద్దుకోకపోతే అంత వేగంగా ఖాళీ అవుతుందనే హెచ్చరిక. ఢిల్లీ పెద్దలతో సంబంధాలు లేక, రాష్ట్రంలో ప్రజా క్షేత్రంలో నిలబడలేక, కుటుంబం అండ కోల్పోయి, ఇప్పుడు అంతర్గత కోటరీ రాజకీయాల్లో మునిగిపోతున్న వైఎస్సార్‌సీపీ నుంచి క్యాడర్ పక్కకు జరగడానికి సాయిరెడ్డి వేసిన ఈ టైమ్ బాంబ్ ' ప్రధాన కారణం కానుంది. ఈ లేఖ ద్వారా విజయ సాయిరెడ్డి జగన్‌ను సజ్జల నుంచి వేరుచేసే ప్రయత్నం చేయలేదు. సజ్జలను నమ్ముకున్న జగన్‌కు పార్టీలో భవిష్యత్తు లేదనే సంకేతాన్ని క్యాడర్‌కు బలంగా పంపించారు. ఈ అగ్గి రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీలో ఎలాంటి రాజీనామాలు లేదా గ్రూపు జగడాలకు దారితీస్తుందో చూడాల్సి ఉంది.

# ఆలయాలకు మహర్ధశ...

తిరుపతి, సెప్టెంబర్ 3 ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 5 వేల దేవాలయాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టీటీడీ, దేవాదాయశాఖ అధికారులను ఆదేశించారు.రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల దేవాలయాల నిర్మాణంపై ఏపీ సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఆలయాల నిర్మాణం కోసం ప్రతిపాదిత స్థలాలు త్వరలోనే ఖరాలు చేసి పనులు ప్రారంభించాలని సూచించారు. ఆధ్యాత్మికతను మరింత ప్రోత్సహించేలాకార్యక్రమాలను విస్తృతం చేయాలని సూచించారు. ఆలయాల నిర్మాణం, ఆధ్వర్యంలో ధార్మిక, విద్య, వైద్య సేవలపై క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు.ఆంధ్రప్రదేశ్ లో 28 జిల్లాల్లో 161 నియోజకవర్గాల నుంచి 4,192 ఆలయాల నిర్మాణానికి ప్రతిపాదనలు అందాయని టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర సీఎంకు వివరించారు. 967 ఆలయాల నిర్మాణం పూర్తయిందని 3 కేటగిరీలుగా నిర్మించేలా ప్రణాళిక రూపొందించామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలు, మత్స్యకార ప్రాంతాలు, బలహీన వర్గాల కాలనీలతో పాటు సాధారణ ప్రాంతాల్లోనూ ఆలయాలు నిర్మిస్తున్నట్టు వెల్లడించారు.శ్రీవాణి ట్రస్టు ద్వారా వచ్చే నిధులను కూడా ఆలయాల నిర్మాణానికి వినియోగించాలని, శ్రీవారి సేవకుల సేవలు వినియోగించుకోవాలని, భక్తుల భాగస్వామ్యాన్ని కూడా పెంచాలని ముఖ్యమంత్రి సూచించారు. సభ్యులు, భక్తులు, శ్రీవారి సేవకులతో ఎగ్జిక్యూటివ్ కమిటీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇతర రాష్ట్రాల్లోనూ శ్రీవారి ఆలయాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని, ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలతో సంప్రదింపులు జరపాలన్నారు. మారిషన్ వంటి దేశాలు స్వామివారి ఆలయాలు నిర్మించాలని కోరుకుంటున్నాయి..భవిష్యత్ లో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా మారేలా కార్యక్రమాలను రూపొందించాలని సూచించారుకొత్త నిర్మించే ఆలయాల్లో విగ్రహాల ఏర్పాటు, అర్చకుల శిక్షణకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని చంద్రబాబు సూచించారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న 1000 పాత ఆలయాలను పునరుద్ధరించాలని, శివాలయాలు, శక్తి పీఠాల అభివృద్ధిపైనా దృష్టి పెట్టాలన్నారు. అన్ని ఆలయాలకు సంబంధించిన వివరాలను డిజిటలైజ్ చేయాలన్నారు.దేవాదాయశాఖ పరిధిలో ఉన్న 28 వేల ఆలయాలు, నిర్వహిస్తున్న 65 ఆలయాలతో పాటు కొత్తగా నిర్మించే 5 వేల ఆలయాల నిర్వహణకు ముందస్తు ప్రణాళిక అవసరం అన్నారు.నిర్వహిస్తున్న అన్నదానం, శ్రీవారి సేవకుల సేవలు, ఆలయాల నిర్మాణం వంటి కార్యక్రమాలను హిందూ ధర్మ ప్రచారంతో అనుసంధానిస్తూ మరింత విస్తృతం చేయాలన్నారు ఎన్టీఆర్ ప్రారంభించిన అన్నదానం కార్యక్రమం గొప్ప సేవా కార్యక్రమంగా మారిందని చెప్పారు. ప్రాణదానం ట్రస్టు ను టీటీడీ వైద్య సేవలకు బెస్ట్ మోడల్ గా తయారు చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. నిపుణులైన వైద్యుల సేవల్ని కూడా వినియోగించుకోవాలన్నారు.

# సాక్షిలో కనిపించని వైఎస్

హైదరాబాద్, సెప్టెంబర్ 3 వైసీపీ ఏపీలో అధికారంలో ఉన్నప్పుడు.. అంతకుముందు ప్రతిపక్ష స్థానంలో ఉన్నప్పుడు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో జగన్మోహన్ రెడ్డి సొంతంగా పార్టీ పెట్టినప్పుడు.. ఇలా అనేక సందర్భాలలో వైఎస్ రాజశేఖర్ రెడ్డిని ప్రజల మదిలో మహానేతగా చిత్రీకరించేవారు. వైయస్ జయంతిని.. వర్ధంతిని అదేదో పండగలాగా జరిపేవారు.వైఎస్ వల్లే రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు వ్యవసాయం చేస్తున్నారని.. అన్నం తింటున్నారని.. ఐటీ ఉద్యోగాలు చేస్తున్నారని.. విమానాలు ఎక్కుతున్నారని.. ఇలా రకరకాలుగా సాక్షి ప్రచారం చేసేది. జగన్ కూడా మైక్ అందుకుంటే చాలు రాజశేఖర్ రెడ్డి మహానుభావుడు.. మార్తాండ తేజుడు అనే లెవెల్ లో స్పీచ్ లు దంచేవాడు. అంతేకాదు.. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఏపీ ప్రభుత్వంలో అమలు చేసిన ప్రతి సంక్షేమ పథకానికి వైఎస్ పేరు పెట్టారు. వైయస్ ఒక మహా ఋషి అని.. వైయస్ ఏపీ రాష్ట్రంలో ఒక ధ్రువతార అని ప్రచారం చేసేవారు.వైయస్ జయంతి కార్యక్రమాలను.. వైయస్ వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించేవారు. సాక్షిలో పేజీలకు పేజీలు యాడ్స్ కుమ్మేసేవారు. కానీ ఇప్పుడు.. అధికారం లేదు.. ఏపీలో ప్రతిపక్ష స్థానం లేదు. కనీసం సోదరి షర్మిల తో మెరుగైన సంబంధం లేదు. పార్టీ కోసం కష్టపడ్డ వాళ్ళు లేరు. ఆపత్కాలంలో వెంట నడిచిన వారు లేరు. మొత్తంగా జగన్ ఏకాకి. ఇలాంటి సందర్భంలో తండ్రి వర్ధంతి గురించి సొంత మీడియాలో కొంచెం కూడా రాయించలేకపోయాడు. సాక్షి పత్రికలో భూమన కరుణాకర్ రెడ్డి.. ఉండవల్లి అరుణ్ కుమార్ మినహా వైఎస్ ప్రస్తావన లేదు.నిజంగానే సాక్షి వైఎస్ ను మర్చిపోయిందా.. అప్పట్లో సాక్షి ఛానల్ లోగోలో వైయస్ ఫోటో కనిపించేది. 2024 ఎన్నికలకు ముందు సాక్షి లోగోలో వైఎస్ పేరు తొలగించారు. సాక్షి మాస్టర్ హెడ్ పక్కన మాత్రమే రాజశేఖర్ రెడ్డి ఫోటోను కొనసాగిస్తున్నారు. ఇక అప్పట్లో వైసీపీ అధికారిక లోగోలో కూడా వైఎస్ ఫోటో కనిపించేది. ఆయన ఫోటోను కూడా సైజు తగ్గించారు. జగన్ ఫోటో పరిమాణాన్ని పెంచారు. ఇంకా చెప్పాలంటే వైయస్ ఉనికిని జగనే తగ్గిస్తున్నట్టు టిడిపి నేతలు ఆరోపిస్తున్నారు. చివరికి వైయస్ వర్ధంతిని కూడా సాక్షి




పేపర్లో ప్రచురించలేదు. సాక్షి ఛానల్ లో ప్రస్తావించలేదు. దీనినిబట్టి వైయస్ జగన్ తనకు అనుకూలంగా ఉన్న సమయంలో ఎలా వాడుకున్నారు.. ఇప్పుడు ఎలా పక్కన పెడుతున్నారు.. అనే విషయాన్ని గుర్తించాలని టిడిపి నేతలు అంటున్నారు. ఆస్తుల విషయంలో కన్నతల్లికి నోటీసులు ఇచ్చినవాడు.. చనిపోయిన తండ్రిని ఎలా గుర్తుంచుకుంటాడని టిడిపి నేతలు విమర్శిస్తున్నారు. మరి దీనికి వైసిపి నాయకులు ఏ విధంగా సమాధానం చెప్తారో చూడాల్సి ఉంది. అన్నట్టు ఈ కథనం రాసే సమయం నాటికి ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల వైయస్ సమాధి వద్ద నివాళులర్పించారు. ఆమెకు ఆరోగ్యం సహకరించకపోయినప్పటికీ తన తండ్రిని గుర్తుచేసుకొని కన్నీటి పర్యంతమయ్యారు. అయినా తండ్రి విషయంలో బిడ్డ ప్రేమ.. కొడుకు ప్రేమ ఒకే విధంగా ఉండదు.

# సింహపురిలో బిగ్ ఫైట్

నెల్లూరు, సెప్టెంబర్ 3 నెల్లూరు జిల్లా రాజకీయాల్లో అధికార తెలుగుదేశం పార్టీ, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల మధ్య మాటల యుద్ధం మరియు ఆధిపత్య పోరు ఒక్కసారిగా పీక్స్‌కు చేరింది. ముఖ్యంగా జిల్లాలో సాగుతున్న క్వార్ట్జ్ మైనింగ్ వివాదం మరియు అంతర్గత రాజకీయ విభేదాల నేపథ్యంలో, వైఎస్సార్సీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి టీడీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని టార్గెట్ చేస్తూ అత్యంత ఘాటు వ్యాఖ్యలతో సవాల్ విసిరారు."ప్రభాకర్ రెడ్డి.. నువ్వు నిజంగా మొగోడివైతే వెనక ఉండి రాజకీయం చేయడం ఆపి, నేరుగా మీడియా ముందుకు వచ్చి మాట్లాడు" అంటూ బహిరంగంగా సవాల్ చేశారు. తనపై లేదా వైఎస్సార్సీపీ నేతలపై ఎలాంటి ఆరోపణలు చేయాలన్నా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి స్వయంగా ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడాలని నల్లపురెడ్డి డిమాండ్ చేశారు. మీ ఇంట్లో బాత్రూమ్‌లు కడిగే వాళ్లతోనో, సమాజంలో తిరిగే బ్రోకర్ గాళ్లతోనో ప్రెస్ మీట్లు పెట్టించి మాపై మాట్లాడించడం నీకు పద్ధతి కాదంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.తెరవెనుక ఉండి ఇతరుల ద్వారా ఇంటర్వ్యూలు ఇప్పించే దొంగచాటు రాజకీయాలు మానుకొని ధైర్యంగా తలపడాలని ఆయన హితవు పలికారు. ఇదే క్రమంలో మాజీ మంత్రి, వైస్సార్సీపీ కీలక నేత అనిల్ కుమార్ యాదవ్ ప్రస్తావనను నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి గట్టిగా లేవనెత్తారు. "నీకు అనిల్ కుమార్ యాదవ్ అంటే ఎందుకంత భయం? ఆయన పేరు వింటేనే ఎందుకు వణికిపోతున్నావు?" అంటూ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. అనిల్ కుమార్ యాదవ్ గతంలో మైనింగ్ వ్యవహారాలపై సంధించిన ప్రశ్నలకు, చేసిన విమర్శలకు చేతనైతే మీడియా ముందుకు వచ్చి నేరుగా సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు.వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి సంబంధించిన ఆర్థిక, మైనింగ్ మరియు రాజకీయ అక్రమాలకు సంబంధించిన మరిన్ని కీలక ఆధారాలు తమ వద్ద సిద్ధంగా ఉన్నాయని నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సమయం వచ్చినప్పుడు వాటన్నింటినీ ఆధారాలతో సహా ప్రజల ముందు బయటపెడతామని, మిమ్మల్ని అంత సులభంగా వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇటీవల కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులపై వైఎస్సార్సీపీ నేతలు చేసిన విమర్శలు, ఆ తర్వాత జరిగిన దాడుల నేపథ్యంలో ఈ తాజా కౌంటర్ నెల్లూరు జిల్లా రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది.

# జూన్ నాటికి పోలవరం ప్రారంభం....



ఏలూరు, సెప్టెంబర్ 3 ఏపీకి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన కీలక అప్డేట్ వచ్చింది. తొలి దశ కింద కేంద్ర ప్రభుత్వం అందించే నిధులు 41.15 మీటర్ల నీటి నిల్వ మట్టానికే పరిమితమైనప్పటికీ, సివిల్ పనులు మాత్రం జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం అయిన 45.72 మీటర్ల వరకు కొనసాగుతాయని కేంద్రం స్పష్టం చేసింది. వైసీపీ ఎంపీ పీవీ మిథున్ రెడ్డి లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్‌భూషణ్ చౌధరి ఈ వివరాలను లిఖితపూర్వకంగా వెల్లడించారుపోలవరం ప్రాజెక్టు తొలి దశ పనులను 2027 జూన్ నాటికి పూర్తి చేయాలని స్పష్టమైన లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన సభకు తెలిపారు. ఎంపీ మిథున్ రెడ్డి పోలవరం ఫేజ్-1 నిధుల ఆమోదం, ఇప్పటివరకు విడుదల చేసిన గ్రాంట్లు, 2027 నాటికి నీటి నిల్వ లక్ష్యం, కాలువల నెట్‌వర్క్ పై కేంద్రాన్ని ప్రశ్నలు అడిగారు. వాటితోపాటు విద్యుత్ కేంద్రం, సహాయ పునరావాస బకాయిల వివరాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్పిస్తున్న తాజా ప్రాజెక్టు నివేదికలు, యుటిలైజేషన్ సర్టిఫికెట్ల పురోగతిపై కేంద్ర మంత్రి సమాధానాలు ఇచ్చారు.కేంద్ర మంత్రి తెలిపిన వివరాల ప్రకారం, 41.15 మీటర్ల ఎలివేషన్ లెవెల్ వరకు నీటిని నిల్వ చేసే పోలవరం ఫేజ్ 1 పనులకు 2023 నాటి ధరల అంచనాల ప్రకారం రూ. 30,436.95 కోట్ల నిధులు అందించడానికి కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ ఆమోదించిన మొత్తం బడ్జెట్‌లో ఇంకా కేంద్రం నుంచి రాష్ట్రానికి చెల్లించాల్సిన బాకీ గ్రాంట్ రూ. 12,157.53 కోట్లుగా ఉంది. ఇందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 5,512.40 కోట్లు, గత ఆర్థిక సంవత్సరం 2025-26 లో రూ. 2,810.22 కోట్లను ప్రాజెక్ట్ పనుల కోసం విడుదల చేసింది.ప్రస్తుతం 41.15 మీటర్ల వరకు నీటిని నిల్వ చేసే క్రమంలో పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం సజావుగా సాగుతోందని కేంద్ర మంత్రి వివరించారు. గ్యాప్-1, గ్యాప్-2లలో ప్రధాన డ్యామ్ నిర్మాణంతో పాటు భూసేకరణ, సహాయ పునరావాస పనులు మొత్తం 2027 జూన్‌కల్లా పూర్తి చేస్తామని వెల్లడించారు. అయితే కేంద్ర గ్రాంట్ 41.15 మీటర్ల వరకు ఉండే ఫేజ్-1 పరిధిలోని సివిల్ పనులు, 45.72 మీటర్ల వరకు భూసేకరణ, పునరావాస కార్యక్రమాలు, కాలువల నిర్మాణానికే వర్తిస్తుందని తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నిర్మాణ వ్యయాన్ని మాత్రం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే స్వయంగా భరించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే ఏపీ ప్రభుత్వం అవసరమైన టెక్నికల్ డాక్యుమెంట్లు, యుటిలైజేషన్ సర్టిఫికెట్లను సకాలంలో సమర్పిస్తోందని ఆయన తెలిపారు.

# కదిరిలో బీజేపీ ఫ్లెక్సీలు చించేసిన టీడీపీ నేతలు

కదిరి,కదిరి లో బీజేపీ కార్యకర్తలు పెట్టిన ఫ్లెక్సీలను టీడీపీ నేతలు చించేంసారు. బీజేపీ అనుబంధ సంఘాల జాతీయ కోఆర్డినేటర్ గా విష్ణు వర్ధన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈనెల 5వ తేదీన కదిరిలో భారీ ర్యాలీకి ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రి సత్యకుమార్లతో కూడిన విష్ణువర్ధన్ రెడ్డి ఫ్లెక్సీలను టీడీపీ నేతలు చించేశారని బీజేపీ నేతల ఆరోపణ. టీడీపీ ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ వర్గీయులపై బీజేపీ నేతల అనుమానం . సీసీ కెమెరా ఫుటేజ్ పరిశీలిస్తే టీడీపీ నేతల బండారం బయటపడుతుందిని అంటున్నారు. కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

# గడువులోగా ఎస్ఐఆర్ పూర్తి--

## జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 03: జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా పారదర్శకంగా పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని వివరించారు. జిల్లాలో ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియ 85 శాతం పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను ఈ వారంలో పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఫారం-6, 7, 8లకు సంబంధించి సుమారు 14 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ముఖ్యంగా కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించిన ఫారం-6 దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. బీఎల్ఓ స్టేటస్ కాల్‌బుక్‌లో 12 అంశాలు, ఎన్‌జీఎస్‌పీలో రెండు ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా త్వరితగతిన పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని కలెక్టర్ తెలిపారు.

# నంద్యాలలో ఇంటర్‌జోనల్ బాక్సింగ్ పోటీలు---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 03-: నంద్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మధుమణి ఆసుపత్రి ఆడిటోరియంలో ఇంటర్‌జోనల్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళారాధన అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు ముఖ్యఅతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ఇటీవల తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి అమరావతి క్రీడా పోటీల్లో నంద్యాల జిల్లా బాక్సింగ్ క్రీడాకారులు ఒక బంగారు, నాలుగు రజత పతకాలు సాధించి తృతీయ స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. నంద్యాలలో బాక్సింగ్ శిక్షణ శిబిరాలతో పాటు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. డాక్టర్ మధుసూదనరావు మాట్లాడుతూ క్రీడాకారులు మహమ్మద్ అలీ, మేరీకోమ్ వంటి ప్రముఖులను ఆదర్శంగా తీసుకుని నిరంతర సాధనతో ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ పోటీల్లో కర్నూలు, నంద్యాల, అన్నమయ్య జిల్లాల నుంచి 150 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటున్నారని జిల్లా కార్యదర్శి ఫయాజ్ తెలిపారు. బాల, బాలికలకు వేర్వేరు బరువు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నూర్ భాషా, చంద్రశేఖర్, నాగేంద్ర, ఆనంద్, కోచ్‌లు, రెఫరీలు, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నీళ్లు అడిగితే కేసులా?--

## నంది రైతు సమాఖ్య ఆగ్రహం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 3: సాగు, తాగునీరు విడుదల చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్లిన రైతులు, వారికి మద్దతుగా నిలిచిన మాజీ ప్రజాప్రతినిధులపై కేసులు నమోదు చేయడాన్ని నంది రైతు సమాఖ్య తీవ్రంగా ఖండించింది. రైతులపై నమోదు చేసిన 35 కేసులను ప్రభుత్వం వెంటనే భేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. రైతు సమాఖ్య కార్యాలయంలో అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, కోశాధికారి మధుసూదన్‌రెడ్డి, శంకర్‌నాయక్, మాజీ సర్పంచ్ కోటిరెడ్డి ఎర్రన్న మీడియాతో మాట్లాడారు. రైతులు శాంతియుతంగా తమ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా అడ్డుకోవడం, అనంతరం



కేసులు నమోదు చేయడం అన్యాయమన్నారు. శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు ఉన్నప్పటికీ దిగువకు నీటిని విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రబీ పంటల సాగు కోసం వెంటనే సాగు, తాగునీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని, కక్షసాధింపు చర్యలు మాని రైతులపై కేసులు ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ఉద్యోగుల నిరసన--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 3: ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఏపీజేఏసీ అమరావతి ఇచ్చిన ఉద్యమ పిలుపులో భాగంగా నంద్యాల జిల్లాలో మూడో రోజు కూడా నిరసనలు కొనసాగాయి. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులకు హ్యాండ్ టు హ్యాండ్ ప్రచారం నిర్వహించి ఉద్యమ కార్యాచరణను వివరించారు. అనంతరం నంద్యాల కలెక్టరేట్‌తో పాటు రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల వద్ద ఉద్యోగులు లంచ్ అవర్ నిరసనలు చేపట్టారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వెంటనే పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు శాంతియుత, ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని మరింత ఐక్యంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# రాయలసీమ నీటిపై మౌనం ఎందుకు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి , సెప్టెంబర్ 3: శ్రీశైలం జలాశయంలో క్యారీ ఓవర్ నీటిని నిల్వ చేయకుండా 39.26 టీఎంసీలకు పరిమితం చేయడంపై రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి ప్రశ్నించారు. గత ఏడాది కృష్ణా జలాలు సమృద్ధిగా వచ్చినప్పటికీ జలాశయంలో తగినంత నీటిని నిల్వ చేయకపోవడం వల్ల ప్రస్తుతం రాయలసీమ సాగు, తాగునీటి అవసరాలపై ప్రభావం పడే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తి పేరుతో శ్రీశైలం నీటిని సాగర్‌కు తరలిస్తూ, రాయలసీమ ప్రాజెక్టుల ఆయకట్టుకు సకాలంలో నీరు అందించకపోవడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాయలసీమకు నీరు దానం కాదని, హక్కు అని స్పష్టం చేశారు. ఎల్‌నినో పరిస్థితులను సాకుగా చూపకుండా శ్రీశైలం జలాశయ విధివిధానాలను అమలు చేసి రాయలసీమ ప్రాజెక్టులు, ఆయకట్టు, చెరువులు, కుంటలకు తాగు, సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# అవమానంతో వ్యక్తి ఆత్మహత్య--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 03-: గోస్పాడు మండలం జిల్లెల గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన తెలుగు వెంకటరమణ ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. రాజకీయ విభేదాలు, అవమానకర వ్యాఖ్యలతో మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది. ఆత్మహత్యకు ముందు సూసైడ్ నోట్‌తో పాటు వాయిస్ రికార్డు చేసినట్లు సమాచారం. తన ఆత్మహత్యకు కొంతమంది వ్యక్తులే కారణమని అందులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఘటనపై గోస్పాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సూసైడ్ నోట్, వాయిస్ రికార్డు ఆధారంగా అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నారు. దర్యాప్తు పూర్తయిన తర్వాతే అసలు కారణాలు, బాధ్యులపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# రాజకీయ వత్తిళ్లతో మెప్మాలో మల్లగుల్లాలు!--

## సీఆర్పీల తొలగింపుపై అధికారులపై ఒత్తిళ్లు--

## ప్రజా సమస్యల వేదికలో కలెక్టర్‌కు బాధితుల మొర--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 03-: మెప్మా కార్యాలయంలో రాజకీయ వత్తిళ్లు అధికారులకు తలనొప్పిగా మారినట్లు సమాచారం. సీఆర్పీలుగా పనిచేస్తున్న కొందరిని తొలగించాలని అధికార పార్టీ నాయకుల నుంచి ఒత్తిళ్లు వస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఇప్పటికే తొలగించిన సీఆర్పీలు తమకు అన్యాయం జరిగిందంటూ జిల్లా కలెక్టర్ నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఆశ్రయిస్తున్నారు. తమను ఎలాంటి కారణాలు చూపకుండా విధుల నుంచి తొలగించారని, న్యాయం చేయాలని బాధిత సీఆర్పీలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిసింది. దీంతో ఒకవైపు అధికార పార్టీ నాయకుల నుంచి వస్తున్న ఒత్తిళ్లు, మరోవైపు జిల్లా అధికారుల ఆదేశాలు, ఫిర్యాదులతో మెప్మా పీడీ కార్యాలయ సిబ్బంది సతమతమవుతున్నట్లు సమాచారం. సీఆర్పీల నియామకాలు, తొలగింపుల వ్యవహారం రాజకీయ రంగు పులుముకోవడంతో




అధికారులు ఎటువంటి నిర్ణయం తీసుకోవాలో అయోమయానికి గురవుతున్నట్లు తెలుస్తోంది. బాధితుల ఫిర్యాదులపై సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, అర్హులైన సీఆర్పీలకు అన్యాయం జరగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

# ఏఎస్ఐ కుటుంబానికి బీమా చెక్కు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 3: కారు ప్రమాదంలో మృతి చెందిన ఆళ్లగడ్డ పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ జి. సురేష్‌రెడ్డి కుటుంబానికి పోలీసుశాఖ తరఫున గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కింద మంజూరైన రూ. 20.80 లక్షల చెక్కును జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్, గురువారం అందజేశారు. చెక్కును సురేష్‌రెడ్డి భార్యకు స్వయంగా అందించిన ఎస్పీ, పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమానికి శాఖ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎస్. ఖాదర్‌భాషా, అధికారులు వీరన్న, కవిత, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు స్వామినాయక్ పాల్గొన్నారు.



# రెడ్‌క్రాస్ సేవల్లో భాగస్వాములు కావాలి: కలెక్టర్ రాజకుమారి---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 3: రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను మరింత విస్తృతం చేసి, అత్యవసర సమయాల్లో ప్రజలకు రక్తం అందుబాటులో ఉండేలా విస్తృతంగా రక్తదాన శిబిరాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు. రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది రెడ్‌క్రాస్‌లో సభ్యత్వం తీసుకుని సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని కోరారు. రెడ్‌క్రాస్ సేవలకు గాను గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం, ప్రశంసా పత్రం అందుకున్న కలెక్టర్‌ను గురువారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్వో రాము నాయక్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. యువత, మహిళల్లో రక్తదానంపై అవగాహన కల్పించాలని, ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేసేలా ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన, మహిళా సంఘాల సమన్వయంతో రక్తదాన శిబిరాలను విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు.



# నేడు గాజులతో అమ్మవారి అలంకరణ--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 03-: శ్రావణ శుక్రవారం సందర్భంగా మహానంది పుణ్యక్షేత్రంలోని శ్రీ కామేశ్వరి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేకంగా గాజుల అలంకరణ నిర్వహించనున్నారు. అమ్మవారి అలంకరణ కోసం 'శ్రీదేవి సేవా సంఘం' ఆధ్వర్యంలో 40 మందికి పైగా మహిళలు భక్తిశ్రద్ధలతో పూలమాలలు తయారు చేస్తున్నారు. మహిళలు స్వయంగా తయారు చేసిన పూలమాలలతో అమ్మవారిని అలంకరించనుండటంతో ఆలయంలో ప్రత్యేక శోభ నెలకొననుంది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ కోరింది.



# కుష్టు కేసుల గుర్తింపునకు ఇంటింటా సర్వే--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 3: జాతీయ కుష్టు నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 11 నుంచి 24వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఇంటింటా సర్వే నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం. శారదాబాయి తెలిపారు. ఈ మేరకు జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో డిస్ట్రిక్ట్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించి వివిధ శాఖల అధికారులకు అవగాహన కల్పించారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో 1,611 బృందాలు ఇంటింటా సర్వే నిర్వహించనున్నాయి. ఆశా కార్యకర్త, పురుష స్వచ్ఛంద కార్యకర్తతో కూడిన బృందాలు రోజుకు 20 నుంచి 25 ఇళ్లను సందర్శించి కుటుంబ సభ్యులందరినీ పరీక్షిస్తాయి. అనుమానితులను సమీప ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యుల ద్వారా నిర్ధారణ చేసి చికిత్స ప్రారంభిస్తారు. దాగి ఉన్న కుష్టు కేసులను ముందుగానే గుర్తించి చికిత్స అందించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టి జిల్లాను కుష్టు రహితంగా తీర్చిదిద్దడమే కార్యక్రమం లక్ష్యమని అధికారులు తెలిపారు. సమావేశంలో జిల్లా కుష్టు, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారులు, డీపీఆర్వో మల్లికార్జున, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ సుంకులమ్మ దేవాలయం పునరాభివృద్ధికి తోడ్పాటును అందించండి..

విభారే న్యూస్ సెప్టెంబర్ 3 ఎమ్మిగనూరు..స్థానిక మెయిన్ బజార్లో ఉన్న శ్రీ సుంకులమ్మ అమ్మవారి దేవాలయం పునరాభివృద్ధి చేపట్టడానికి కి. శే. తక్కశిల పాపయ్య శెట్టి వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో 07.09.2026 నుండి పనులు ప్రారంభించదలిచారు. భక్తాదులు ఈ అభివృద్ధి కార్యక్రమంలో పాలుపంచుకొని తమ వంతు వస్తు రూపేనా ధన రూపేనా సహాయ సహకారాలు అందించి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని వారు కోరారు. వివరాలకు పై సెల్ నంబర్ల వారిని సంప్రదించగలరు.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**